క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న భాస్కరరావు

జామి: మండలంలోని భీమసింగి నాలుగు రోడ్ల కూడలిలో వాకచర్ల భాస్కరరావు, చంద్రవతి దంపతుల ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. తన తండ్రి అప్పలరాజు జ్ఞాపకార్థం ఈచలివేంద్రం ఏర్పాటు చేసినట్లు భాస్కరరావు తెలిపారు. తొలిరోజు ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.కార్యక్రమంలో వి.నరేష్, సంతోష్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకం నిర్వహణకు విరాళం



పథకం నిర్వాహకులకు నగదు అందజేస్తున్న దాత

చీపురుపల్లి: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన పథకం నిర్వహణ కో సం గరివిడి టీచర్స్ కాలనీకి చెందిన మజ్జి కమలాకర్ రూ.30 వేల విరాళం ప్రకటించారు. పథకం నిర్వాహకులు ఎస్.సన్యాసిరావుకు దాత గురువారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ నిత్యన్నదాన పథకం నిర్వహణ కోసం ఐదేళ్ల నుంచి ఏటా రూ.30 వేల చొప్పున అంద జేస్తున్నట్లు చెప్పారు. లయన్స్‌క్లబ్ సభ్యులు డి.సీతారామరాజు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి మృతి



కేశవ(ఫైల్)

కొత్తవలస: మండలంలోని మసివానిపాలెం గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి కోన కేశవ (24) బుధవారం రాత్రి మృతి చెందారు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాలు.. లక్కవరపుకోట మండలం కళ్లేపల్లి సచివాలయంలో కేశవ వ్యవసాయ సహాయకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. రాత్రి గుండెల్లో మంట వస్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన కొత్తవలస ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడికి ఏడాది క్రితమే వివాహమైంది. మృతుడి కుటుంబానికి లక్కవరపుకోట మండల ఏఓ స్వాతికుమారి, తోటి ఉద్యోగులు సంతాపం తెలిపారు.

నేడు ఉపకరణాల అందజేతకు గుర్తింపు శిబిరం

చీపురుపల్లిరూరల్(గరివిడి): సమగ్రశిక్ష అభియాన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులు, విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేసేందుకు గరివిడి ఎంఈఓ కార్యాలయం వద్ద ఉన్న భవిత సెంటర్‌లో శుక్రవారం గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓలు పి.రామారావు,డి.అప్పన్న గురువారం తెలిపారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాలకు చెందిన 3 నుంచి 18 ఏళ్లలోపు ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఈ శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, సద రం సర్టిఫికెట్, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. అర్హులకు వీల్ చైర్స్, ట్రైసైకిళ్లు, రొలేటర్స్, వినికిడి యంత్రాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధన ఉల్లంఘనపై కేసు నమోదు

బొండపల్లి: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సదస్సు నిర్వహించిన టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు గురువారం తెలిపారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ, టీడీపీ నాయకుడు బొడ్డు రాము ఆధ్వర్యంలో టీడీపీ జయహో బీసీ సదస్సు నిర్వహణకు గాను పోలీసు, రెవెన్యూ, ఎంపీడీఓకు అనుమతి కోసం బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. అయితే సభ అనంతరం ప్రాంగణంలో 300 మంది కార్యకర్తలకు భోజనాలు పెట్టడంతో పాటు నిబంధనలు అతిక్రమించి భారీ ఎత్తున బాణసంచా కాల్చినట్లు ఎన్నికల పరిశీలకుడి పరిశీలనలో తేలింది. ఈ మేరకు బొడ్డు రాముపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

17 మద్యం బాటిల్స్ స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి కూడలి వద్ద ఓ మహిళ అక్రమంగా తరలిస్తున్న 17 మద్యం బాటిల్స్ పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. నిందితురాలిని మెంటాడ మండలంలోని కుంటినవలస గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఎత్తిపోతలు అంటూ ఉత్తుత్తి మాటలు

- ఎన్నికల ముందు రైతులను మోసం చేసే యత్నం
- ఎత్తిపోతల పథకం 'కళా'కు ఇన్నాళ్లకు గుర్తొంచిందా అంటూ విమర్శలు
- 2014–19 వరకు టీడీపీయే అధికారంలో ఉంది
- ఆ కుటుంబమే ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్నారు..
- కళా కూడా అప్పుడు రాష్ట్ర మంత్రిగానే పనిచేశారు
- అప్పుడు మిన్నకుండి ఇప్పుడు రైతులను మభ్యపెడుతున్న వైనం



చీపురుపల్లి: అధికారంలో ఉంటే ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన రాదు.. అసలు ప్రజలే గుర్తుకు రారు.. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రజలు ఎన్ని కష్టాలు పడుతున్నా వారికి అండగా ఉండాలన్న మనసు అసలే ఉండదు.. కానీ ఎన్నికలు వచ్చే సరికి మాత్రం ప్రజలపై ఎక్కడాలేని ప్రేమ పుట్టుకొచ్చి ఇంటింటికీ తిరిగేస్తారు.. అది చేస్తాం.. ఇది చేసేస్తాం అంటూ ఉత్తరకుమారుడి ప్రగల్భాలు పలికేస్తారు.. ఇది టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి పార్టీ మండల నాయకుల వరకు కనిపించే తీరు. హామీలు ఇచ్చి మోసం చేయడం అలవాటైన పసుపుపార్టీ నాయకులు.. ఇప్పుడు చీపురుపల్లి నియోజకవర్గంలో ఉత్తుత్తి హామీలివ్వడం ప్రజలను, రైతులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు మెరకముడిదాం మండలానికి ఎత్తిపోతల పథకం అంటూ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయంటూ రైతులు విమర్శిస్తున్నారు.

2014–19 వరకు ఏమి చేశారో..?

మెరకముడిదాం మండలానికి ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చి తోటపల్లి సాగునీరు అందిస్తామని కళా వెంకటరావు బుధవారం జరిగిన సమావేశంలో రైతులపై కపటప్రేమ ఒలకబోశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోనే ఉందని, ఆ సమయంలో ఎత్తిపోతల పథకం ఎందుకు తీసుకురాలేదని ఆ మండలంలో రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆ సమయంలో అదే కుటుంబానికి చెందిన వారే ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండడంతో పాటు కళా వెంకటరావు కూడా మంత్రిగానే పనిచేశారని, అప్పుడెందుకు మెరకముడిదాం రైతుల వైపు కన్నెత్తి చూడలేదనే చర్చ రచ్చబండలపై సాగుతోంది. ఎన్నికల వేళ ఓట్ల కోసం ఎత్తిపోతలు అంటూ ఉత్తిత్తి మాటలు చెప్పడంపై మండిపడుతున్నారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ పనులకు రూ.400 కోట్లు నిధులు కేటాయించి, 117 కిలోమీటర్ల మేర కాలువ తవ్వించి ఈ ప్రాంత ప్రజలకు సాగునీటి సదుపాయం కల్పించిన ఘనత దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిదేని, చంద్రబాబు వల్ల నియోజకవర్గ ప్రజలకు జరిగిన మేలు శూన్యమని ఈ ప్రాంత రైతులే చెబుతున్నారు.

ఇప్పుడు గుర్తుకొచ్చిందా..



తెలుగుదేశం పార్టీ నాయకులకు ఎన్నికల సమయంలో మాత్రమే తోటపల్లి కాలువ నుంచి సాగునీరు మెరకముడిదాం మండలానికి అందలేదన్న విషయం గుర్తుకువస్తుంది. తర్వాత పట్టించుకోరు. మంత్రిగా పనిచేసిన సమయంలో కనీసం ఈ ప్రాంతవాసులకు కనిపించని కళా.. ఇప్పుడు ఓట్లు కోసం ఉచిత హామీలివ్వడం విడ్డూరంగా ఉంది.

– లెంక భాస్కరరావు, మెరకముడిదాం

మెరకప్రాంతం వల్లే..



మెరకముడిదాం మండలం పూర్తిగా మెరకప్రాంతం. తోటపల్లి సాగునీరు మండలానికి ఇవ్వలేకపోతున్నట్లు తోటపల్లి జలాశయం ఇంజినీర్లు అప్పడే చెప్పారు. మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు ఏ మేరకు రైతులకు మేలు చేయాలని ప్రయత్నించారో మాకు తెలుసు. తెలుగుదేశం పార్టీ నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ప్రయత్నించలేదు. అప్పుడు చేయలేని పనిని ఇప్పుడు ఎలా చేసేస్తామని చెబుతున్నారు. మరోసారి మండలానికి చెందిన రైతులను మోసం చేయాలను కోవడం తగదు.

– సత్తారు శ్రీనివాసరావు, గర్భాం (గ్రామం), మెరకముడిదాం మండలం

ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా

- మీకు మంచి జరిగితేనే ఓటు వేయండని చెప్పిన దమ్మున్న వ్యక్తి సీఎం జగన్
- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ సీఎంగా కొనసాగాలి
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



భోనంగిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ప్రచార రథంపై ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

గంట్యాడ: పేద ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా అని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెను మత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని బోనంగి, మదుపాడ గ్రామాల్లో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం అమలు చేశారని చెప్పారు. పార్టీలక తీతంగా అర్హులందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తన పాలనలో మీకు మంచి జరిగితేనే ఓటు వేయండని చెప్పిన దమ్మున్న నాయకు డు సీఎం జగన్ అని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలే దని గుర్తు చేశారు. టీడీపీ నాయకుల బూటకపు హామీలు, మాయమాటలను నమ్మ వద్దని ప్రజలకు సూచించారు. సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ సమప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని, నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చారని, ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్నారని చెప్పారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో అమ్మఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్లు అందజేసేవారమని, చంద్రబాబు తన మనుషులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేయనీయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. చంద్రబాబు కుటిల రాజకీయాలకు వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, ఎంపీటీసీ పట్నాన శివభారతి, సర్పంచ్ అంతకాపల్లి రాంబాబు, మదనాపురం ఎంపీటీసీ గుల్లిపల్లి చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, నాయకుడు నారాయణమూర్తిరాజు, జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం పాల్గొన్నారు.

ఎండలు మండుతున్నాయి.. జాగ్రత్త



దత్తిలో వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కొత్తవలస: ఎండల తీవ్రత వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, వడబెబ్బకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని అప్పన్నపాలెం, దత్తి, దన్నినపేట గ్రామాల్లో ఉపాధి హామీ వేతనదారులకు గురువారం అవగాహన కల్పించారు. హెచ్ఎస్ ఈశ్వరరావు, హెల్త్ సహాయకులు సత్యారావు మాట్లాడుతూ కళ్లు తిరగడం, తిమ్మిర్లు, దద్దుర్లు, నీరసం, తలనొప్పి, వికారం, జ్వరం, వాంతులు వంటివి వడదెబ్బ లక్షణాలు అని చెప్పారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించా లన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగరాదన్నారు. అత్యవసర పరిస్థితిలో బయటకు వెళ్లే వారు కాటన్ దుస్తులు, చెప్పులు, టోపీ, కళ్లదాలు ధరించాలని, వెంట తాగునీరు తీసుకువెళ్లాలని సూచించారు. డీహైడ్రేషన్‌కి గురుకాకుండా ఉండేందుకు కొబ్బరి నీళ్లు, బార్లీ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలను సేవించాలన్నారు. ఆయిల్, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్ పి.భవాని, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ వెంటే జనం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి



రేవళ్లపాలెంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి, నాయకులు

శృంగవరపుకోట: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని, రానున్న ఎన్నికల్లో మళ్లీ ఫ్యాను ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో రేవళ్లపాలెం, సీతారాంపురం, మామిడిపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు ఎమ్మెల్యేకు మేళాలు, కోలాటాలతో, ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ జగనన్న ఐదేళ్ల పాలనలో ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందాయని, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా గడప వద్దకు పాలన అందించారని చెప్పారు. మీకు మంచి జరిగిందనిపిస్తేనే ఓటేయండని ప్రజలకు నిజాయితీగా సేవ చేసి ఓటు అడిగే దమ్మున్న నాయకుడు జగన్ అన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి, అధికారం కోసం సిగ్గూ,లజ్జా లేకుండా జట్లు కట్టి వస్తున్న తోడేళ్ల గుంపును తరిమికొట్టాలన్నారు. జనం కోసం నిలబడ్డ జగన్ వస్తేనే సంక్షేమం సాగుతుందన్నారు. ఎస్‌కోట ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు, విశాఖపట్నం ఎంపీ పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మికి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి జగనన్నకు మద్దతివ్వాలని కోరారు. రేవళ్లపాలెంలో తెలుగుదేశం పార్టీకి చెందిన మేడిశెట్టి సత్యనారాయణ, చిన్నంనా డు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రచారంలో రేవళ్లపాలెం వైస్ సర్పంచ్ గణేష్, సీతారాంపురం సర్పంచ్ మిడతాన చిన్నంనాయుడు, మామిడిపల్లి సర్పంచ్ చిట్టిపోలు మంగ, ఎంపీటీసీలు చప్ప లత, గుమ్మడి సన్యాసప్పడు, స్టేట్‌ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, వైస్ ఎంపీపీ పి.వి.రమణ, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, జేసీఎస్ ఇన్‌చార్జి వాకాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మద్దతివ్వండి



చీపురుపల్లి : చీపురుపల్లిలో ఇంటింట ప్రచారం చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు



గుర్ల: సొలిపిసోమరాజుపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు మద్దతుగా త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ప్రజలను అభ్యర్థించారు. చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స సత్యనారాయణ, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు మద్దతుగా చీపురుపల్లి పట్టణంలో, మెరకముడిదాం మండలం పులిగుమ్మి గ్రామంలో, గుర్ల మండలంలోని సొలిపిసోమరాజుపేటలో ఆయా మండలాల నాయకులు గురువారం ఇంటింట ప్రచారం చేశారు. ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి మద్దతుగా వేపాడ మండలంలోని ఆకులసీతంపేటలో ఆ మండలం నాయకులు ప్రచారం చేశారు.

– చీపురుపల్లి/ మెరకముడిదాం/గుర్ల/వేపాడ



మెరకముడిదాం: పులిగుమ్మి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



వేపాడ: ఆకులసీతంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కేసుల్లో ఇరుక్కోవద్దు

బొండపల్లి: ఎన్నికల నేపథ్యంలో అనవసరంగా గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కోవద్దని ఎస్ కె.లక్ష్మణరావు ప్రజలకు సూచించారు. మండలంలోని ముద్దూరు గ్రామస్తులకు ఎన్నికల నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని, పాత నేరస్తులతో పాటు పోలీసుల రికార్డుల్లో ఉన్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న బొత్స సాయి గురునాయుడు

గజపతినగరం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తనయుడు సాయిగురునాయుడు అన్నారు. మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు,కార్యకర్తలు, గ్రామపెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు మంజూరు చేసిందని, వివక్ష లేకుండా అభివృద్ధి చేసిందని చెప్పారు. సీఎం జగన్ చేసిన సంక్షేమం, అభివృద్ధికి మద్దతుగా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గజపతినగరం ఎమ్మెల్యేగా అప్పలనరసయ్యను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, నాయకులు కర్రి రామునాయుడు, గురుగుబిల్లి సత్యనారాయణ, కర్రి నానాజీ, కాలంరాజుపేట సర్పంచ్ గేదెల ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేత్రవైద్య శిబిరం

గజపతినగరం: సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని లయన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో గురువారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 102 మందికి ఆప్తాలమిక్ బి.రామునాయుడు, సిబ్బంది నేత్రపరీక్షలు చేశారు. వీరిలో16 మంది ని క్యాటరాక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేశారని, వీరికి శుక్రవారం ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష,కార్యదర్శులు సాయికుమార్,సాయిరేవంత్ తెలిపారు. శిబిరం కో-ఆర్డినేటర్ పి.బాబ్జి, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు లక్ష్మణ్, అజయ్,అక్షయ్,శ్యామ్,జగదీష్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

14న మాక్ పాలిసెట్

శృంగవరపుకోట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఈనెల 14వ తేదీన మాక్ పాలిసెట్ నిర్వహిస్తున్నట్లు పట్టణానికి చెందిన లక్ష్య ఫౌండేషన్ నిర్వాహకులు చీమలపాటి శర్మ, అజ్జాడ నరేష్, వి.ఈశ్వరరావు, బండారు మోహన్, రహీమ్ షేక్‌లాల్ గురువారం తెలిపారు. ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ, జామి మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదివిన విద్యార్థులు మాత్రమే పరీక్షకు అర్హులు అని తెలిపారు. 14వ తేదీ ఆదివారం స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహించి, వరుసగా 1 నుంచి 5 స్థానాలు సాధించిన వారికి రూ.5,000, రూ.3,000, రూ.2,000, రూ.1,500లు, రూ.1,000, 6 నుంచి 10వ స్థానంలో నిలిచిన వారికి ఒక్కొ క్కరికి రూ.500 చొప్పున నగదు బహుమతి ఇస్తామని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ టెస్ట్ హాల్‌టికెట్‌ను తీసుకురావాలని సూచించారు.

పీహెచ్‌సీ సందర్శన

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ బృందం గురువారం సందర్శించింది. ఆసంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు సిరువూరి లక్ష్మీవర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోగాపురపు శ్రీదేవి తదితర బృందం ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



శృంగవరపుకోట: ఎస్.కోటలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



లక్కవరపుకోట: ఎల్.కోట మక్కా మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.కె.మథీన

రంజాన్ వేడుకలను ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్.కోటలోని జామియా మసీదులో మత గురువు షేక్ ఖాసిం రిజ్వీ నేతృత్వంలో ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేశారు. అక్కడి నుంచి పుణ్యగిరి రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు చేరుకున్నారు. ఈద్గాలో పవిత్ర ప్రార్థనలు చేశారు. పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం తమ ఇళ్లలో బంధువులు, మిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు. ఎల్.కోటలోని మక్కా మసీదులో రాష్ట్ర నూర్ సాహెబ్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.కె.మథీన ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. గజపతినగరం మదీనా మసీదులో మత గురువు కలీమ్ రజా ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జామి: జామి మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గజపతినగరం: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పూలే జీవితం ఆదర్శనీయం



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట బాలికల గురుకుల పాఠశాలలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు



కొత్తవలస: వాగ్దేవి కళాశాలలో పూలే చిత్రపటానికి నివాళ్లుర్పిస్తున్న కళాశాల సిబ్బంది



చీపురుపల్లి: జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పూలే,అంబేడ్కర్ ఆశయ సాధన సమితి అధ్యక్షుడు కృష్ణారావు, తదితరులు



దత్తిరాజేరు: కె.కొత్తవలస బాలుర గురుకుల పాఠశాలలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమని పలువురు వక్తలు అన్నా రు. జ్యోతిరావు పూలే జయంతిని గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పలు విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి రావు పూలే చిత్రపటాలకు, విగ్రహాలకు ఉపాధ్యాయులు, వివిధ సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్